సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే
• శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్
- గణేశ్‌నగర్ ఆంధ్రజ్యోతి 7

గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి
• ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్
- భగత్‌నగర్ ఆంధ్రజ్యోతి 8

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్
- 1.72 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు పూర్తి
- కొన్న ధాన్యం విలువ రూ. 401 కోట్లు
- రూ.319.16 కోట్లు రైతులకు చెల్లింపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 340 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా 326 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతున్నది. ఇప్పటి వరకు 401.17 కోట్ల రూపాయల విలువ చేసే 1,72,919 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

• కంట్రోల్ రూం నంబర్ 9154249272

కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని విక్రయించుకునే రైతులకు మద్దతు ధర, తూకం విషయాల్లో, ఇతర విషయాల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే వారు ఫిర్యాదు చేసేందుకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారానికి రైతులు 9154249272 నంబర్‌కు ఫోన్ చేయాలని జిల్లా యంత్రాంగం ప్రచారం చేస్తోంది. జనవరి వరకు కొనుగోళ్లను కొనసాగించాలని నిర్ణయించారు. జిల్లాలో ఇప్పటి వరకు 26,041 మంది రైతుల నుంచి 1,72,919 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ధాన్యంలో 1,22,035 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 50,884 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉన్నది. కొన్న ధాన్యంలో 1,37,569 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 319.16 కోట్ల రూపాయలను 20,679 మంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరో 5,362 మంది రైతులకు 82.01 కోట్ల డబ్బులు చెల్లించాల్సి ఉన్నది. కొను గోలు చేసిన ధాన్యం వివరాలను అప్‌లోడ్ చేయడంతోపాటు ధాన్యాన్ని తరలించడంలో ఆలస్యం జరుగుతున్న కారణంగా రైతులకు ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన మేరకు 24 గంటల్లో డబ్బు అందడం లేదు. కొనుగోలు కేంద్రాల నుంచి రైసుమిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం చేరగానే మిల్లర్లు ఇస్తున్న ధ్రువీకరణ మేరకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నది.

• రైతుల ఖాతాల్లో బోనస్ జమ

ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించింది. టన్నుకు ఐదువేల రూపాయల చొప్పున ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 50,884 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యానికిగాను 25.44 కోట్ల రూపాయలను బోనస్‌గా రైతులకు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 7.9 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. సంక్రాంతి సమయానికి ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని భావిస్తున్నారు. జిల్లాలో ఆరు లక్షల పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినా కొనుగోలు కేంద్రాలకు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 1,72,919 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. నవంబరు నెలాఖరు వరకు 3.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం



వస్తుందని అంచనా వేసినా అది 2 లక్షల టన్నులు కూడా దాటే అవకాశం కనిపించడం లేదు. కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ఇప్పటికే కనీసం లక్ష టన్నుల ధాన్యాన్ని విక్రయించారని అంచనా వేస్తున్నారు. జనవరిలో కొనుగోళ్లు పూర్తయ్యే వరకు మరో లక్ష టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు.

రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26: రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంతోపాటు నగరంలోని అం బేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లా డుతూ భారత రాజ్యాంగంతోనే ప్రజలకు ప్రాథమిక హక్కులు లభిస్తున్నాయన్నారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తులన తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడి పల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీం నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రావణ్‌నాయక్, గడ్డం విలాస్‌రెడ్డి, మడుపు మోహన్ పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి

• కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో, కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో హస్తకళా వస్తువులను తయారు చేస్తున్న విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మెప్మా, ఐకేపీ, మహిళా ప్రాంగణం, కేజీబీవీ అధికారులతో మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులు తయారు చేసే హస్తకళలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేసిన హస్తకళలకు సంబంధించిన ఎగ్జిబిషన్‌ని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు అందమైన కళాకృతులను తయారు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తయారు చేసే జ్యువెలరీ, డెకరేషన్ వస్తువులు, డోర్ మ్యాట్లు, కాగితంతో తయారు చేసే కళాకృతులు ఆకట్టుకుంటున్నాయని అన్నారు. వీటిని మార్కెటింగ్ చేసేందుకు ప్రణాళిక తయారు చేయాలని అధికారులకు సూచించారు. దీనివల్ల విద్యార్థులకు భవిష్యత్తులో వస్తువుల ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి విషయా లపై అవగాహన కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వేణు మాధవ్, డీసీ స్వరూపారాణి, మహిళా ప్రాంగణం మేనేజర్ సుధా రాణి, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, డీఎంసీ శ్రీవాణి పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

గన్నేరువరం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగు, ఉద్యాన పంటలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు వివరాలు, లాభాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. అనంతరం యాస్వాడలో రైతు అప్పిడి శ్రీరాంరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి రవళి, ఏవో కిరణ్మయి, లోహియా కంపెనీ సీఈవో సిద్ధాంత, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించేలా దీక్షా దివస్

- 29 నుంచి డిసెంబరు 9వరకు కార్యక్రమాలు
- కేసీఆర్ నామస్మరణ లేకుండా రేవంత్ సభలే లేవు
- శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్



దీక్షా దివస్‌సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

కరీంనగర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రతిబింబించేలా ఈనెల 29న దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని శాసనస మండలి వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి బండ ప్రకాశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ మాట్లాడుతూ 2009 నవంబరు 26న దీక్ష చేసేందుకు కేసీఆర్ కరీంనగర్‌కు వచ్చారన్నారు. ఆనాడు వలస పాలకుల వివక్ష పై స్వరాష్ట్రం కోసం తెలంగాణ పోరాటం చేశామని, ఇప్పుడు మరో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అసమర్థ పాలన చేస్తుందని విమర్శించారు. కేసీఆర్ నామ స్మరణ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మీటింగ్ జరుగడం లేదని, రేవంత్‌రెడ్డి ప్రతి సభలో కేసీఆర్ స్మరణనే చేయడం తప్ప ఆయన ఏమి చేస్తాడో చెప్పడం లేదని విమర్శించారు. దీక్షా దివస్‌ను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9వరకు దీక్షా దివస్ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు.


తీగల వంతెన వద్ద మళ్లీ వీకెండ్ మస్తీ

• మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌లో నిర్వహించే దీక్షా దివస్‌లో కేటీఆర్ పాల్గొనడం శుభసూచకమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కేసీఆర్ దీక్ష చేయక పోతే తెలంగాణ వచ్చేదా అని ఒకసారి ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్, కేసీఆర్‌ను కనుమరుగు చేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పడకేసిందని, హామీలు నీటి మూటలయ్యాయని, వాటిపై ఎండగడతామని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని తీగల వంతెన వద్ద వీకెండ్ మస్తీని, కళోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణలో గులాబీ జెండా మరోసారి ఎగురుతుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ అల్గునూర్ కరీంనగర్ నగరపాలక సంస్థలో భాగమని, అక్కడ చేపట్టనున్న దీక్షా దివస్‌కు నగరం నుంచి పెద్ద ఎత్తున జనాలను తరలించి విజయవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. దీక్షా దివస్‌కు పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్‌శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై డీఈవో విచారణ

- గోడు వెల్లబోసుకున్న వంటకార్మికులు
- ఈ అన్నం తినలేమంటూ తేల్చిచెప్పిన విద్యార్థులు



ఓల్డ్ హైస్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో అధ్వానంగా మధ్యాహ్న భోజనం పెట్టడంతో విద్యార్థులు ఆందోళనకు దిగినట్లు వచ్చిన వార్తకు డీఈవో డాక్టర్ సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు స్పందించారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులు, వంట కార్మికులతో మధ్యాహ్న భోజనంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంట కార్మికులు తమకు ఇస్తున్న బియ్యంతో



సమస్యలు చెప్పుకుంటున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అన్నం వండి పెడుతున్నామని, మెత్తగా అవుతుందని చెప్పారు. తమకు ఇస్తున్న చార్జీలను పెంచాలని, నాణ్యమైన బియ్యం అందించేలా చూడాలని కోరారు. విద్యార్థులు ఓవైపు ఉడకని, మరోవైపు మాడిన అన్నం పెడుతున్నారని, ఈ అన్నం తాము తినలేమంటూ డీఈవోకు తేల్చిచెప్పారు. వేరే హాస్టల్ నుంచి బియ్యం తెప్పించి ఈరోజు మధ్యాహ్న భోజనం పెట్టించారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో విద్యార్థులు భోజనం చేశారు.

కన్నుల పండువలా కార్తీక దీపోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 26: కరీంనగర్ టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి కార్తీకమాస దీపోత్సవాన్ని కన్నులపండువలా నిర్వహించారు. కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. పాతబజార్ గౌరీశంకరాలయ అర్చకుడు పురాణం మహేశ్వరశర్మ కార్తీక మాస వైశిష్ట్యాన్ని, దీపం ప్రాధాన్యాన్ని వివరించారు. దీపోత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన భారత జాతి మనదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, శాంతి భద్రతలకు కారణం మన ఆచార సాంప్రదాయాలేనన్నారు. ఈ మాసంలో ప్రకృతితో మమేకమై ఆరాధిస్తూ దీపాలు వెలిగిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో గంప జగన్, తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్, మహిపాల్, భాగ్య, శైలజ, విజయలక్ష్మి, దుర్గం మారుతి, తాడూరి బ్రహ్మం, నరహరి, పిట్ల స్వామి, రమేశ్, భగవాన్, మిర్యాల్‌కర్ ఆనంద్, ములుగూరి కిషోర్, సతీశ్, శ్రీధర్ పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవంలో జ్యోతిని వెలిగిస్తున్న సుగుణాకర్‌రావు దంపతులు, పురాణం మహేశ్వరశర్మ









వివిధ రూపాల్లో దీపాల అలంకరణ

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ చౌక్‌లో వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా నాయకులు దిష్టి బొమ్మను దహనం చేశారు. శాంతియుత నిరసనలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వారన్నారు. పోలీసులే రెచ్చగొట్టే విధంగా మోదీ ప్రభుత్వానికి తొత్తులుగా ప్రజా నాయకులతో దురుసుగా ప్రవర్తించడం సబబు కాదన్నారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. పౌర హక్కుల ఉద్యమనేత ప్రొఫెసర్ సాయిబాబాను 10 సంవత్సరాలు జైల్లో నిర్బంధించి ఆయన మరణానికి కేంద్ర ప్రభుత్వం కారణమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికనరెడ్డి బుచ్చన్నయాదవ్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, భారత్ కిసాన్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయిన అశోక్, కొయ్యాడ సృజన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ దుద్దెడ నరేందర్(34) దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేటకు చెందిన నరేందర్ కరీంనగర్ భగత్‌నగర్‌లో అద్దె ఇంటిలో భార్యపిల్లలతో నివాసం ఉంటున్నాడు. నరేందర్ రాత్రి 11 గంటల సమయంలో కరీంనగర్ నుంచి నగనూర్‌కు ఫుడ్ తీసుకువెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో నరేందర్ బైక్‌పై నుంచి ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురులున్నారు. ఫుడ్ డెలివరీబాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నరేందర్ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి బంధువులు విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన బైక్‌పై ఉన్న వ్యక్తి స్థానిక నగునూర్ వైద్యకళాశాల విద్యార్థి కామినేని యువరాంచందర్‌గా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన ఏఎస్సై మృతి


రామస్వామి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల 17న జరిగిన అగ్నిప్రమాదంలో కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ సీసీ ఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రామస్వామి మంగళవారం మృతిచెందాడు. కరీంనగర్‌లోని ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో రామస్వామి, అతడి భార్య గాయపడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న రామస్వామిని కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ 9రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామస్వామి కొడుకు కూడా కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రామస్వామి మృతి పట్ల పలువురు పోలీసు అధికారులు సంతాపాన్ని వెలిబుచ్చారు.

దొంగతనం కేసులో
ఇద్దరికి ఎనమిది నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్షతో పాటుగా వంద రూపాలయ జరిమాన విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామంలో మార్చి 3వ తేదిన మల్లికార్జున స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఊరడి రాజిరెడ్డి ఇచ్చిన పిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముప్కల్ మండలంకు చెందిన నాగరాజు, నిజమాబాద్ జిల్లాకు చెందిన సాయికుమార్‌లు పాల్పడినట్లు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కి తరలించారు. విచారణ అధికారి గోపాల్‌రెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎమ్ఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ అనే న్యాయవాది కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సదరు ఇద్దరు నేరస్తులకు 8 నెలల కారాగార జైలు శిక్షతో పాటు వంద రూపాయాల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామం మీదుగా మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ సంపత్, యజమాని మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.



తీరనున్న కష్టాలు

- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా సాధారణ బోగీలు
- రెండు నుంచి నాలుగు వరకు పెరిగిన బోగీలు
- పలు రైళ్లకు జత చేసిన అధికారులు
- దశల వారీగా అన్ని రైళ్లలో అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశవ్యాప్తంగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఉన్న రెండు సాధారణ బోగీలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. అన్ని రైళ్లలో నాలుగు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు ఆయా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనంగా మరో రెండు బోగీలను అమరుస్తున్నారు. ఈనెల నుంచి పలు రైళ్లలో అదనపు బోగీలను అమర్చడం ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు సుమారు 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనపు బోగీలను అమర్చనున్నారు. దేశంలోని వివిధ రూట్లలో వివిధ రైల్వేలు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లన్నింటికీ రెండు సాధారణ బోగీలు మాత్రమే అమర్చారు. మిగతా బోగీలు త్రీటైర్, టూటైర్, నాన్ ఏసీ బెర్తులను నడిపారు. వీటిలో ప్రయాణించేందుకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు సీట్లు ఖాళీ ఉంటే స్టేషన్లలో టిక్కెట్లు తీసుకుని ప్రయాణించే సౌకర్యం ఉంది. సాధారణ బోగీలు రెండు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు చాలా మంది సీట్లు నిండిన తర్వాత నిల్చుని ప్రయాణిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో సాధారణ ప్రయాణికుల పరిస్థితి మరింత దారుణం. ఎన్నో ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సాధారణ బోగీలను పెంచాలనే డిమాండ్ ఉంది. ఆ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రులు, అధికారుల దృష్టికి వెళ్లడంతో మరో రెండు సాధారణ బోగీలను జత చేసి నడుపుతామని జూన్‌లో ప్రకటించారు. దీంతో ఈనెల నుంచి పలు రైళ్లకు అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చడం ప్రారంభించారు. వచ్చే నెలాఖరు వరకు దశల వారీగా అన్ని రైళ్లకు అదనపు బోగీలను జత చేయనున్నారని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అదనపు సాధారణ బోగీలను జత చేయడం వల్ల వాటిల్లో ప్రయాణం చేసే వలస కార్మికులకు, దినసరి కూలీలకు, విద్యార్థులకు కొంత ఊరట కలగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైస్‌మిల్ పరిశ్రమలు, ఇటుక బట్టీల పరిశ్రమలతోపాటు భవన నిర్మాణ రంగం, హోటళ్లలో పని చేసేందుకు ఉత్తర భారత దేశం నుంచి వేలాది మంది వలస కార్మికులు పనుల కోసం వస్తున్నారు. అదనపు సాధారణ బోగీలను అమర్చడం వల్ల వలస కార్మికులకు ఎంతో మేలు జరగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి జంక్షన్, రామగుండం, జమ్మికుంట రైల్వేస్టేషన్ల నుంచే వలస కార్మికులు, కూలీలు, ఇతరులు ప్రయాణిస్తుంటారు. జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చారు.



- జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్లలో నిలిచే సికింద్రాబాద్ నుంచి దాణాపూర్ పాట్నా నుంచి సికింద్రాబాద్ 12791/92 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆగే 12295/96 శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు నుంచి దాణాపూర్, పాట్నా నుంచి శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఇప్పుడు ఈ రైలులో నాలుగు సాధారణ బోగీలు ఉన్నాయి. ఇప్పటికే మన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌కి సంబంధించిన దూర ప్రాంత రైళ్లలో మన జోన్‌కు, ఇతర జోన్‌లకు చెందిన రైళ్లలో కొన్నింటిలో అమర్చారు.
- జమ్మికుంట, రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12721/22 నాంపల్లి హైదరాబాదు నుంచి ఢిల్లీ నిజాముద్దీన్, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదు దక్షిణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిచే 12625/26 తిరువనంతపురం నుంచి కొత్త ఢిల్లీ, అక్కడి నుంచి తిరువనంతపురం కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12615/16 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (జీటీ) గ్రాండ్ ట్రంక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జతచేసి నడుపుతున్నారు.
- సాధారణ బోగీలు లేని ఆంధ్రప్రదేశ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 20805/06 విశాఖపట్నం నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి విశాఖపట్నం నడిచే రైలులో నాలుగు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉంది.
- ఇప్పటికే పెద్దపల్లి, రామగుండంలో నిలిచే 22152/51 పూణె నుంచి కాజీపేట, కాజీపేట నుంచి పూణె వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12511/12 రప్తిసాగర్ ట్రైవీక్లీ, కోర్బా బైవీక్లీ, అహిల్యానగరి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12723/24 నాంపల్లి హైదరాబాదు నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదుకు నడిచే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.
- పెద్దపల్లి జంక్షన్‌లో నిలిచే 12656/55 అహ్మదాబాద్ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.

జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన అజ్మీర దేశాయి నాయక్(79) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన దేశాయి నాయక్ సోమవారం అనారోగ్య కారణంతో జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాలికి ముల్లు గుచ్చుకుందని ఆస్పత్రికి తీసుకువస్తే అప్పటి నుంచి ఎలాంటి చికిత్స అందించకపోవడం వల్లనే మృతి చెందాడని, మూడు రోజుల క్రితం వరకు చలాకీగా ఉండి కూలీ పనులు చేసాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందించక పోవడం వల్లనే చనిపోయాడని మృతుడి బంధువుల ఆస్పత్రి వద్ద రోదించారు.

నాంపల్లి గుట్టపైన లీజు హక్కులకు టెండర్

- సరైన వేలం రాకపోవడంతో రద్దు

వేములవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి దేవస్థానములోని పలు లీజు హక్కులకు బుధవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో బహిరంగ వేలము, పేపర్ టెండర్, ఆన్‌లైన్ టెండర్స్ నిర్వహించారు. ప్రమిదలు చమురుతో వున్న వత్తులు అమ్ముకొను హక్కును రెండు సంవత్సరాలకు గాను వేములవాడకు చెందిన బిక్షపతి రూ. 50 లక్షల 55 వేల 555కు దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, పూజ సామాగ్రి అమ్ముకొను హక్కులను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ అనే వ్యక్తి రూ. 55 లక్షల 55 వేల 999లకు, పప్పు బెల్లం, బొమ్మలు ఆటవస్తువులు అమ్ముకునే లీజును రూ. 10 లక్షల 6 వేల 666కు దాచారం గ్రామానికి చెందిన పర్శరాములకు దక్కగా, కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకునే లీజును జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ. 21 లక్ష 55 వేల 999లకు దక్కించుకున్నారు. నాగఫణీ వద్ద ఇన్ స్టాంట్ ఫోటోలు లీజు హక్కును దాచారంకు చెందిన పర్శరాములు రూ. 24 లక్షల 6 వేల 666 హెచ్చుబిడ్డు ద్వారా టెండర్లను దక్కించుకున్నట్లు ఆఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కాగా గుట్టపైన క్యాంటీన్ నిర్వహణ లీజు హక్కును ఎవరు డిపాజిట్లు చెల్లిచలేదని, నూనె గురుగులు, పాలు అమ్ముకును హక్కు అంశములకు సరియగు వేలం పాట రానందున ఇట్టి రెండు టెండర్స్ వాయిదా వేసినట్లు తెలిపారు.

టెండర్ నిర్వహణలో ఆలయ ఈవో, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, దేవాదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖతార్ దేశంలో జగిత్యాల జిల్లా వాసి ఆదృశ్యం?

- ఆరు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ ప్రవాసీ ప్రజావాణిలో భార్య ఫిర్యాదు

గొల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లిన ఓ యువకుడు ఆరు నెలలుగా పత్తా లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తన భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ గల్ఫ్ బాధితుడి భార్య రాసూరి సునీత కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో సీనీయర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవ రాజన్‌కు వినతి పత్రం సమర్పించింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన రాసూరి రాజేందర్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లాడు. అక్కడే పని చేస్తూ ఉన్న క్రమంలో తన ఉద్యోగం పోయిందని, మాల్టా దేశం వెళ్తానని అందుకు రూ. 5 లక్షలు అవసరమవుతాయని, వాటిని తనకు పంపించాలని ఆరు నెలల క్రితం దట్నూర్‌లో ఉన్న తల్లి, భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భార్య సునీత, తల్లి కలిసి బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి రాజేందర్‌కు రూ. 5 లక్షల పంపించారు. డబ్బులు పంపించిన అనంతరం రాజేందర్ ఫోన్ స్విచ్చాప్ అయిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆరు నెలలుగా అతడి ఆచూకీ లభించడం లేదని బాధితుడి కుటుంబ సభ్యులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి దర్యాప్తు చేయించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్‌ను ఆదేశించినట్లు బాధితురాలు సునీత తెలిపారు.


ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట తసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న బోజనం సరుకులు ఎలా తెచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్షల కొద్ది అప్పులు తెచ్చి వంట చేస్తుంటే అధికారులు తనిఖీల పేరిట ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు ఆకాశానంటుతున్నాయన్నారు. మెస్ చార్జీలు పెంచక మూడేళ్లు దాటిందని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరపరా చేయాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అంతకుముందు వినతి పత్రాలు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రాజమణి, మహేశ్వరీ, రేఖ, లక్ష్మణ్, వరలక్ష్మి, నిర్మల, బాలవ్వ, జ్యోతి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతికి మంత్రి పరామర్శ


గొట్టె భూపతిని పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత రెండు రోజుల కిందట మరణించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. కరీంనగర్ మంకమ్మతోటలోని నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టెభూపతి, సుధీర్‌బాబులను కలిసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రితో పాటు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమద్‌నవాబ్, ఎండీ తాజ్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలకు పార్థీవదేహం


లక్ష్మి పార్థీవదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్/కరీంనగర్ రూరల్/కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, రచయిత వీరగోని పెంటయ్య సతీమణి వీరగోని లక్ష్మి(65) పార్థివదేహాన్ని మంగళవారం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈనెల 23న రాత్రి లక్ష్మి గుండెపోటుతో మరణించారు. గత ఏడాది వీరగోని పెంటయ్య, లక్ష్మీ దంపతులు మరణానంతరం దేహదాన అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. వారి కోరిక మేరకు కుమారుడు, కూతురు అమెరికా నుంచి మంగళవారం వచ్చి అంతిమయాత్ర నిర్వహించి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరగోని పెంటయ్య, కుమారులు నరేష్, సురేష్, కుమార్తెలు సమత, సౌజన్య డాక్టర్ బి లచ్చయ్య, రఘుశంకర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, కనకయ్య, రాజేందర్, బుర్ర తిరుపతి, సీవీ కుమార్, డి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీరగోని పెంటయ్య కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పదేళ్లలో చేయని ప్రగతిని ఏడాదిలోనే సాధించాం

- ఎల్‌మడుగు, రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం
- మంథనిలో సిల్క్ డెవలమెంట్ సెంటర్, మహిళ పారిశ్రామిక పార్కు
- మంథని వద్ద గోదావరి నదిపై రూ. 1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- ప్రజాపాలన విజయోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 26: రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేయని అభివృద్ధి పనులను తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సాధించామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవం కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దీవాలా తీసిన ఆర్థిక క్రమశిక్షణతో సీఎం రేవంత్‌రెడ్డి, తమ మంత్రివర్గం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల హామీలో ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన వెంట నే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీపై గ్యాస్ సిలెండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వాటిని త్వరలో అమలు చేయటానికి కృషి చేస్తున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎంఎస్‌పీతో పాటు సన్న వడ్ల రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గింజ తరుగు లేకుండా రైతుల వడ్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే నెలకు 5 వేల ఉద్యోగాల చొప్పున 55 వేల మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పదేళ్లగా ఆగిపోయిన ఉద్యోగుల బదీలు, పీఈటీలకు ప్రమోషన్లను తమ ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. అనేక పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు స్కిల్స్ డెవలప్ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఏడాదిలో అనేక కార్యక్రమాల అమలుతో మందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇంకా విమర్శించడం ఎందుకని ప్రశ్నించారు. వారికి తమ పని తీరుతోనే జవాబు చెప్తామన్నారు. ఏడాదిలో తమ ప్రభుత్వ సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకోవటానికి ప్రజా విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాను, మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామన్నారు. మంథనిలో, పెద్దపల్లిలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామన్నారు. మంథని గోదావరినదిపై రూ.1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మించి వ్యాపారపరంగా అభివృద్ధి చేస్తామన్నారు. కూచిరాజ్‌పల్లి, బోయినిపేటల మీదుగా బైపాస్ రోడ్డును నిర్మిస్తామన్నారు. మంథనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి మహిళలకు ఉపాధి అవకాలు కల్పిస్తామన్నారు. గోదావరినదిలోని ఎల్.మడుగు ఇరువైపులా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు రూ.7కోట్లతో ఖానాపూర్ పిడబ్ల్యూడీ రోడ్ నుంచి ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాన చేశామన్నారు. రామగిరి ఖిల్లాను సైతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా సొంత భవనాలు లేని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు, మున్సిపల్, పీఏసీఎస్ ఛైర్మన్లు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

చికిత్స పొందుతూ గిరిజన బాలిక మృతి


రక్షిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): చిన్న విషయానికి మానసిక ఆందోళనకు గురై ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిరిజన బాలిక మాలోతు రక్షిత(17) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని దేవునిగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంటతండాకు చెందిన మాలోతు మంజుల-తిరుపతి దంపతులకు ఇద్దరు పిల్లలు రక్షిత, రాహుల్ ఉన్నారు. తిరుపతి 14 ఏళ్ల కిందట భార్యాపిల్లలను వదిలి వెళ్లిపోయాడు. దాంతో మంజుల కూతురు రక్షిత, రాహుల్‌ను తీసుకుని 10 ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట గ్రామానికి చేరుకుంది. ఓ గదిని అద్దెకు తీసుకుని బట్టల దుకాణంతో పాటు కుట్లు, అల్లికలతో ఉపాధి పొందుతూ పిల్లలను సాకుతోంది. కూతురు రక్షిత దుమాల ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ చదివి గత యేడాది అనుత్తీర్ణురాలైంది. దాంతో అప్పటి నుంచి తల్లికి చేదోడువాదోడుగా ఉంటోంది. మానసిక స్థితి సరిగా లేక ఆందోళనకు లోనైన ఆమె ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు రక్షితను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే

● శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్



యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ దంపతులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే అని శాతవాహన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎత్నిక్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ ఉమేష్ కుమార్ సతీసమేతంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం వల్ల యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అంతకముందు విద్యార్థులు బోనాలు, పల్లకితో అమ్మవారిని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉగాది, దీపావళి, సంక్రాంతి, కృష్ణాష్టమి, క్రిస్మస్, వినాయక చవితి, బోనాలు, బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించారు. ఉప కులపతిచే ఉట్టి కొట్టించి, జమ్మి పూజ చేసి రావణ దహనం చేయించారు. అనంతరం వీసీ దంపతులు బతుకమ్మ ఆడారు. విద్యార్థులు, అధ్యాపకులు అన్ని పండుగలకు సంబంధించిన 200 రకాల పిండి పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ మనోజ్, డాక్టర్ నరేష్, డాక్టర్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



వసంత్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మహారాష్ట్రలోని పూణే పట్టణంలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న 27వ జాతీయస్థాయి కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా జిల్లాకు చెందిన కే వసంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ ఎస్ శ్రీనివాసన్ నుంచి ఆదేశాలు అందుకున్నట్లు వసంత్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన నాంపల్లి (49) అనే వ్యక్తి నల్లగొండ గుట్ట ప్రాంతానికి సోమవారం అడవి పందుల వేట కోసం వెళ్లినట్లు సమాచారం. నాంపల్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గుట్ట శివారు ప్రాంతంలో గాలింపు చేపట్టారు. నాంపల్లి విద్యుదాఘాతానికి గురై కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోతీలాల్ తెలిపారు.

కోనోకార్పస్‌తో ముప్పు..!



హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మొక్కలు తొలగించాలని కోరుతున్న ప్రజలు
- ప్రజాప్రతినిధులు స్పందించాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి, పట్టణాల్లోని డివైడర్ల మధ్య సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హాని ఇవి హానికరమని అంటున్నారు. ఈ చెట్ల మీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంతో హానికరమో ఇట్టే అర్థమవుతుంది. హుజూరాబాద్ నుంచి శాలపల్లి-ఇందిరానగర్ గ్రామం వరకు ఇటు హుజూరాబాద్ నుంచి బోర్నపల్లి వరకు, కొత్తపల్లి వరకు ప్రధాన రహదారుల మధ్య కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి.

● అవెన్యూ ప్లాంటేషన్.., రహదారుల పక్కన

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం-పరిశుభ్రత, హరితహారం కార్యక్ర మంలో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ. 50లు వెచ్చించి కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగ నివ్వకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. అలాగే ప్రకృతి వనంలో, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహ దారుల పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

● చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ..

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రమే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డు వచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణానికి హాని కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు లేదా పండ్ల మొక్కలు నాటాలి.

- వేల్పుల ప్రభాకర్, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర ఉపయోగపడే మొక్కలు నాటాలి.

-బింగి కరుణాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి, రంగాపూర్.

జాతీయ స్థాయి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి



హోమ్ రాజ్

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 30వ తేదీ వరకు జరగబోయే అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి కె. హోమ్‌రాజ్ ఎంపికయ్యాడు. కాగా హోమ్‌రాజ్‌ను స్కూల్ డైరెక్టర్ కర్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- నాలుగు రోజుల క్రితం మృతి
- పంచనామా చేసిన అధికారులు

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీనివాస్ (40) అనే యువకుడి మృతిపై అనుమానాలు తలెత్తడంతో అధికారులు పంచనామా నిర్వహించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు సాధరణ మృతి అని చెప్పి అంత్యక్రియలు నిర్వహించారు. తన తమ్ముడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, అక్క విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ఫాతిమా మంగళవారం ఒగులాపూర్ గ్రామానికి చేరుకొని ఎముకలు, బూడిదను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

గుంతలో పడి వాహనదారుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి గుంతలో పడి బొప్పాపూర్‌కు చెందిన వాహనదారుడు బిస్క సత్యం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వాహనం గుంతలో పడి అదుపు తప్పింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ



కార్మిక దంపతులు, చిన్నారికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి సురేఖ

● మంత్రి కొండా సురేఖ

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఆలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వాటిపై సర్వే నంబర్‌ల వారిగా విచారణ చేపడుతుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని 50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు రంగాపూర్ గ్రామం నుంచి మంత్రి, ఎమ్మెల్యేను ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలుకగా ఆలయ సమీపంలో మంత్రిని ఎడ్లబండి ఎక్కించి ఆలయం వరకు మహిళలు కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన యాదాద్రిని నిర్మించినా భక్తులకు ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో భక్తులకు తాగునీరు, వసతులు కల్పించామన్నారు. అలాగే యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తొడుగును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యదాద్రి వద్ద వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం, బ్యాటరీ కార్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే వేములవాడ ఆలయాన్ని సైతం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారంతో ఆలయానికి ఉపయోగపడే ఆభరణాలు, అలంకరణ వస్తువులు తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఆలయంలో ఉన్న బంగారం, వెండిని లెక్కించి వాటితో వెండి పల్లకీలను తయారుచేయించి నూతనుత్తేజం ఉండేవిధంగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని త్వరలోనే అధికారులతో సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎండోమెంట్ పరిధిలోని ప్రతి ఆలయానికి టీటీడీ నుంచి వచ్చే నిధులు రాకుండా చేసిందని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి సబ్బితం ఆలయం అనుసంధానం చేయనున్నట్లు, ప్రతినెల నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు రానున్నట్లు తెలిపారు. గ్రామస్థులు సైతం ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కలబోయిన మహేందర్, చంద శంకర్, చుంచు సదయ్య పాల్గొన్నారు.

కార్మిక దంపతులను చూసి చలించి..

- దుస్తులు, చెప్పులు కొనిచ్చిన మంత్రి

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ వెళ్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో పూసాల చౌరస్తా సమీపంలో తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారిని గమనించారు. కారు ఆపి దిగి ఆమె వద్దకు వెళ్లారు. చెప్పులు లేకుండా చిన్నారిని రోడ్డుపై నడిపిస్తున్న ఒడిశా కార్మిక దంపతుల మందలించారు. వారిని తనతో పాటు ఓ చెప్పుల షాపులోకి తీసుకువెళ్లి ముగ్గురికి చెప్పులు కొనిచ్చారు. ఆ తర్వాత బట్టల షాపులోకి తీసుకవెళ్లి దుస్తులు కొనిచ్చారు. మంత్రి ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

జస్టిస్ స్వామినాథన్ కమిషన్

సిఫార్సులను అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అభివృద్ధి కోసం జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీ యూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ చెప్పిన విధంగా పంట దిగుబడి అయ్యే వరకు ఎంత ఖర్చు అయ్యిందో దానికి అదనంగా 50 శాతం ధరను పెంచి పంటలకు రేటు నిర్ణయించాలని, కానీ అమలు కావడం లేదని అన్నారు. దీనికి తోడు రైతు దేశంలో ఎక్కడైనా పంటను అమ్ముకోవచ్చని చెప్పినా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేక దళారుల రాజ్యంగా మారిపోయిందన్నారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ శక్తులకు, ఎఫ్‌డీఐలకు అనుకూలంగా మార్చిందని, 8 గంటల పని విధానానికి బదులు 12 గంటల పని భారాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సింగరేణి, రైల్వేలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్య, వైద్యం, కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్తున్నాయని, దానిని నిరోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేవీ అనసూయ, పోచయ్య, మల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, మారుతి, నర్సింగోజి, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సోమిశెట్టి దశరథం, గుజ్జె దేవదాస్ ఉన్నారు.

40 ఏళ్ల ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత



నేలకూలిన ట్యాంకు

గంగాధర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 40 సంవత్సరాలుగా గ్రామస్థులకు తాగు నీరందించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరగా అధికారులు మంగళవారం కూల్చి వేశారు. గంగాధర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి ఎదురుగా 40 ఏళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకు పక్కన గ్రంథాలయం, ప్రజల ఇళ్లు ఉండగా అధికారులు కూల్చడంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోకుండా సురక్షితంగా ట్యాంకును కూల్చి వేశారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

- ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ
- వేములవాడలో బద్దిపోచమ్మకు బోనం
- కొండగట్టులో భక్తుల పూజలు



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భక్తులతో కిక్కిరిసిపోయిన బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగాణం

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తులరద్దీ మంగళవారం పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజ లు, కుంకుమార్చన, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించారు. స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, అర్చకులు, నిత్యపూజలు, అభిషేకాది కార్యక్ర మాలు నిర్వహించారు.

25 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 25వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలుచేసి నదీ మాత కు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేములవాడ కల్చరల్ : వేములవాడ బద్దిపోచమ్మ అమ్మ వారికి భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమ వారం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి దర్శనానికి బారు లుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సుమారు నాలుగు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో వేచి చూశా రు. అనంతరం పట్నాలువేసి ఒడిబియ్యం సమర్పించారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొన సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కొనసా గుతోంది. కార్యక్రమాన్ని ఆలయాధికారులు మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. వేకువ జాము నుంచే వందలాది వాహనాలు, కాలిన డకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు ఆలయం ముందుగల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీకపూజలు చేశారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో నెల రోజులుగా నిర్వహి స్తున్న సామూహిక కార్తిక దీపోత్సవంను మంగళవారం పర్య వేక్షకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

నిబంధనలు పాటించాలి

కరీంనగర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలని ఎంఈవో రవీందర్ అన్నారు. మంగళవారం యంఈవో కార్యాలయంలో ప్రైవేటు స్కూల్ యజమాన్య ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూడైస్ పిఎల్‌జిఎస్, జీపీ ఈపి, విద్యార్థుల నమోదు, రికార్డులు సరిగా ఉండాలని ఆదేశించారు.

సాగుపై అవగాహన

కరీంనగర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించగా రైతులకు వరి కొయ్యలలో మొక్కజొన్న సాగుపై, డ్రోన్ సహాయంతో వ్యవసాయం గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలకు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మీ, యంఎఓ సత్యం, ఏఈఓలు పైడితల్లి, స్వర్ణలత, అనూష, ఉదయ్ సుచరిత రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కరీంనగర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాల్లో, కొనుగోలు కేంద్రాలను మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మీ తనిఖీ చేశారు. దుర్శేడ్, చెర్లబూత్కూర్, నగునూర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. బొమ్మకల్, నగునూర్, చెర్లబూత్కూర్, చామనపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో యంఎఓ బి.సత్యం, ఎఈఓలు పైడితల్లి, సుచరిత, అనూష, స్వర్ణలత, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల మహా పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం నుంచి ఈ మహాపాద యాత్ర ప్రారంభమవతుందని వేములవాడ వరకు కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు ప్రసన్న, మాధవి, మహదేవుని భార్గవి, విజయ్, ఉమారాణి పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం




కరీంనగర్‌లో నివాళులు చేస్తున్న ఎమ్మెల్యే గంగుల, దళిత సంఘాల నాయకులు, ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులతో భారత సంవిధానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, ఏసీపి వేణు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అంబేద్కర్ చిత్రపటానికి కరీంనగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌ఫోర్స్ (ఏఆర్) అడిషనల్ డీసీపీ అనోక్‌జయకుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు జానిమియా, శ్రీధర్‌రెడ్డి, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

●భగత్‌నగర్: బీజేపీ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నివాళులు అర్పించి రాజ్యంగ పరిరక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ల రమేష్, నాగేశ్వర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, సోమిరెడ్డి వేణుప్రసాద్, జాడి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రయాణ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో బస్‌స్టేషన్ మేనేజర్ ఎస్ అంజయ్య, లచ్చినాయక్, రీజనల్ ప్రెసిడెంట్ దొంత రాజయ్య, లక్పతి నాయక్, రమణ పాల్గొన్నారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని సెయింట్‌జాన్స్ పాఠశాలలో ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ విజయమేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పి ఇన్నాలు, ప్రైమరీ బ్లాక్ ఇంచార్జి సిస్టర్ ఆరోగ్యం పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు నివాళులర్పించారు.

●వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందితో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ప్రతిజ్ఞ చేయించారు.

●డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రక్షించకపోతే బానిసత్వం తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు అడ్వకేట్ వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లను రద్దు చేయడం కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాగి రాజేశ్, పార్లమెంట్ ఇంచార్జీ మాతంగి హనుమయ్య, మహమ్మద్ చాంద్‌పాష, చిప్పరి కరుణాకర్, మాల మహానాడు జాతీయ కమిటి సభ్యులు నీరటి శంకర్, పులి రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: రాజరాజేశ్వర ప్రభుత్వ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, విభాగాధిపతి సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

●వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

●విద్యుత్ సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఈ రమేష్‌బాబు ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పిఓ చంద్రయ్య, ఏడి టెక్నికల్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసు, శ్రీహరి పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాలతి, వైస్ ప్రిన్సిపల్ సమత, సూపరింటెండెంట్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి లర్పించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల పాల్గొన్నారు.

●హుజూరాబాద్ లీగల్: హుజూరాబాద్ కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి ఆలేఖ్య, మొదటి అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్ పద్మ సాయిశ్రీ, రెండో అడిషనల్ మేజిస్ట్రేట్ స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, ఏజీపీ గుర్రం శ్రీనివాస్‌గౌడ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, పలువురు న్యాయవాదులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మొలంగూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

●రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంఈవో అంబటి వేణుకుమార్ నివాళులర్పించారు

●తిమ్మాపూర్: అలుగునూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రమేష్, నాయకులు గోపు మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

●మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘ భవనంలో సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జలపతి, నాయకులు మాతంగి శంకర్, మాతంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

●చిగురుమామిడి: సుందరగిరి గ్రామంలోని భారత రాజ్యాంగ చిహ్నం వద్ద రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ తాళ్ల నరేష్, మండల అధ్యక్షుడు జిల్లేల సురేష్, బెజ్జంకి రవీందర్, అనిల్, గిరి, విష్ణు ఉన్నారు.

●వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, గ్రంథ పాలకుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

●మానకొండూర్: మండల కేంద్రంలోని చెరువుకట్ట బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గసిగంటి సంపత్, మండల యూత్ అధ్యక్షులు కొండ్ర సురేష్, ఎ స్సీ సెల్ మండల అధ్యక్షుడు కనకం అశోక్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న జడ్జి

గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

-ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



మాట్లాడుతున్న గజ్జెల శ్రీకాంత్

భగత్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, కేజీబీవీ విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాలు, కెజిబివిలలో సమస్యలు పెరిగిపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు వెల్లువెత్తుతున్నా అధికారులు పర్యవేక్షణ చేసిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించి, పెరిగిన ధరలకనుగుణంగా మెస్ ఛార్జిలు పెంచి పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇషాక్, శ్రీజ, సహాయ కార్యదర్శి భోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు సందేష్, నాయకులు తరుణ్, సన్ని, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) మంగళవారం మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష వాస్తు ఆగమ శాస్త్ర పండితుడు నమిలకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో కార్తీక మాస హస్తా నక్షత్ర యుక్త ఏకాదశి ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

పారాయణాలతో పాటు అభిషేక అర్చనలు, హోమం శాస్త్రోక్తంగా జరిపారు. కార్తీక మాస వైశిష్ట్యాన్ని భక్తులకు రమణాచార్యస్వామి వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణమా చార్యులు, వివేక్‌స్వామి, రమేశ్‌స్వామి, గీతాచార్యులు, శ్రీరామసేవా తరంగిణిట్రస్టు బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కమిటీలో ఉర్దూ జర్నలిస్టులను చేర్చాలి

సుభాష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్రిడిటేషన్ కమిటీలో ఉర్దూ జర్నలిస్టులను చేర్చాలని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బృందం కోరింది. ఈమేరకు మంగళవారం కలెక్టర్ పమేలాసత్పతికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిసార్ అహ్మద్‌పర్వాన, అథర్‌మోయిన్, సయ్యద్ అస్గర్ హుస్సేన్, సయ్యద్ అతిఫుద్దీన్ సయ్యద్, షాకీర్ ఎస్‌సమాద్, హఫీజ్, అర్షద్, ఖాజీ మహ్మద్ ఇఫ్తిఖారుద్దీన్, అలాముద్దీన్ మీర్జా ఫైజ్ బేగ్, ఖలీద్‌బిన్‌సాలం, అన్వర్ హుస్సేన్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు పాలు పంపిణీ

కరీంనగర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్వేత విప్లవ పితామహుడు స్వర్గీయ డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం మిల్క్ డే సందర్భంగా ఐడిఎ తెలంగాణ చాప్టర్ చైర్మన్ సిహెచ్.రాజేశ్వర్‌రావు శాతవాహన యూనివర్శిటీ వాకర్స్‌కు, స్కూల్ పిల్లలకు, అంధ పాఠశాల విద్యార్థులకు వేడి పాలు, బిస్కట్లను పంపిణీ చేశారు. అనంతరం కరీంనగర్ డెయిరీ ఆవరణలోని డాక్టర్ వర్గీస్ కురియన్ విగ్రహానికి ఐడీఏ చాప్టర్ చైర్మన్, సభ్యులు, డెయిరీ అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఐడిఎ తరఫున బెస్ట్ ఉమెన్ ప్రొడ్యూసర్ అవార్డును పూదరి గంగవ్వకు ప్రధానం చేసూ 10వేల రూపాయల నగదు, మెమెంటోను అందించారు. ఈకార్యక్రమంలో ఐడిఎ వైస్ చైర్మన్ సాంబమూర్తి, జనరల్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి, ట్రెజరర్ లక్ష్మారెడ్డి, ఇసి మెంబర్ కృష్ణారెడ్డి, కరీంనగర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.శంకర్‌రెడ్డి, బెయిఫ్ రాష్ట్ర అధికారి హేమంత్, కరీంనగర్ డెయిరీ బోర్డు డైరెక్టర్ ఎం.ప్రభాకర్‌రావు, కె.సూర్యారావు, డెయిరీ అధికారులు, పాల ఉత్పత్తిదారులు, సిబ్బంది తదితరులు పాల ఓ్గన్నారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయాలి

భగత్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని నిలిపి వేయాలని కలెక్టర్‌కు చింతకుంట మాజీ ఉపసర్పంచ్ పట్టెం లక్ష్మీనారాయణ వినతిపత్రం అందించారు. గ్రామంలోని సర్వే నంబర్ 142లో గల భూమి ఊర చెరువు శిఖం భూమి ఇట్టి భూమిలో పక్కనే ఉన్న 114/ఎ సర్వే నెంబర్ గల భూమిని చూపిస్తు అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారని వెంటనే అక్రమంగా నిర్మాణాన్ని నిలిపి వేయాలని ఆయన కోరారు.

ఈజీఎస్ పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలి



ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధిహామీ పనులను మార్చి31లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో సంజీవరావు, ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి, ఏపీఓ శోభరాణి, యంఎఓ సత్యం, మండల ప్రత్యేకాధికారులు, ఆయా గ్రామాల్లో కార్యదర్శులు ప్రారంభించారు. 17 గ్రామాల్లో 17 పనులకు గాను 11లక్షల 71వేల నిధులతో ఆయా గ్రామాల్లో షెడ్‌ల నిర్మాణం, కోళ్ళ ఫారం, పొలాల అభివృద్ధి, ఫాం ల్యాండ్, ఫార్మేషన్ రోడ్డు, జలనిధి పనులు, హర్వేస్టింగ్, ఇరిగేషన్ ఓపెన్ వెల్, శానిటేషన్‌కు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సంజీవరావు మాట్లాడుతూ రైతులు ఉపాధిహామీ పనులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. పొలం గట్లపై పండ్ల చెట్లు, కోళ్ళ ఫారాలు, షెడ్‌ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల కార్యదర్శులు, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

భగత్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండ లంలో పలు అభివృద్ధి పనులకు కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ మంగళవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పంజాల స్వామిగౌడ్, మడుపు మోహన్, బానోతు శ్రావణ్‌నాయక్, బోనాల మురళి, రుద్ర మనోహర్, పంజాల శ్రీనివాస్, బొమ్మ ఈశ్వర్, కోడూరు శ్రీనివాస్, గడ్డం శ్రీరాం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో రజ్వీచమన్ కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణానికి మంగళవారం కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మండల మైనారిటీ అధ్యక్షుడు షైబాజ్ ఉల్లా ఖాన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ షాహనవాజ్ ఉద్దీన్, మాజీ ఎంపీటీసీ బద్రున్నిసా పాషా, మాజీ వార్డు సభ్యులు అయేషా పజిడ్, సర్వర్, సలీం, హాజీ, నవాబ్ బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎల్‌జీఏ 24వ వార్షికోత్సవాలను విజయవంతం చేయండి

హుజూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 2నుంచి 8వరకు నిర్వహిస్తున్న పీఎల్‌జీఏ 24వ వార్షికోత్సవాలను ప్రజాసంఘాలు, మేధావులు, యావత్ పార్టీల కమిటీలు విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న కగార్ విప్లవ ప్రతిఘాతుక యుద్ధాన్ని తిప్పికొడుతామని పేర్కొన్నారు. దేశంలో నూతన ప్రజా స్వామిక విప్లవ విజయ సాధన కోసం ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తూ ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి డిసెంబరు నాటికి 24ఏళ్లు నిండుతాయని తెలిపారు. గత ఏడాదిగా విప్లవ సానుభూతి పరులకు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు, మానసిక వేదింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు కుమ్మక్కై విప్లవ ఉద్యమాన్ని బలహీన పరుస్తూ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాలతో క్యాంపులు వేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారని పేర్కొన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకలు

హుజూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో మినీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రేవరేడ్ జాన్ బాబు ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు పాటలు పాడుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సొల్లు బాబు, ప్రియాంక, చరణ్, రవీందర్, మహేందర్, స్రవంతి, హిమవంతు, సునీత, పుష్పలత, రాణి, సబిత, లలిత, శంకర్, రజిత, జయంతి, బ్లెస్సీ, శ్రేష్ఠ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

రామడుగు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో రామడుగు మండలం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల-తిరుపతి దంపతులను మంగళవారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేషం ముదిరాజ్, ముదిరాజ్ యువత రాష్ట్ర అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ బాసవేణి శ్రీనివాస్, రామడుగు మండలాధ్యక్షుడు జిట్టవేణి రాజు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చవద్దు

చిగురుమామిడి,నవంబరు 26: రైతులు వరికొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయాధికారి నక్క రాజులు నాయుడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి కోతల తర్వాత రైతులు ఇతర పంటలు వేసుకోవడానికి వరి కొయ్యలకు నిప్పుపెడుతున్నారన్నారు. దీనితో భూమిలోని పోషకాలు లేకుండా పోయి పంట దిగుబడి రాదన్నారు. వరి కొయ్యలు మాగే విధంగా పొలాన్ని దున్నాలన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

సైదాపూర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులు ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దెనపల్లి గ్రామంలో వడ్లకొండ రాజేందర్‌రెడ్డి అనే రైతు పశువులపాక ముగ్గు పోసినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. సోమారం మోడల్ స్కూల్ రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వర్క్ ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈజీఎస్ జాయింట్ డైరెక్టర్ నర్సింహులు, డీఆర్డీవో శ్రీధర్, ఏపీడీ కృష్ణ, ఎంపీడీవో యాదగిరి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి, లక్ష్మాజిపల్లి, మల్యాల గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి వడ్లకొండ అనిల్‌కుమార్ బృందం సభ్యులు మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆవునూరి కోమల, మహాదేవుని శ్రీధర్, ఎర్ర సురేష్, రావుల తిరుపతి, శ్రీధర్, రాజు, నిజాముద్దీన్, సాయికుమార్, తిరుపతి, ఆసియా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

మానకొండూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాఘవాపూర్, ఊటూర్ గ్రామాలలో మంగళవారం రూ. 80లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ, పశువుల పాక నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో ఉపాధిహామీ పథకంలో పలు అభివృద్ధి పనలుకు భూమి పూజ చేపట్టడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు మర్రి ఓదెలు, ఉపాధ్యక్షులు రామిడి తిరుమల్‌రెడ్డి, ఎంపిడివో వరలక్ష్మీ, సిడిపివో శ్రీమతి, మాజీ సర్పంచులు బొట్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ : గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం అని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో గ్రామీణ రహదారుల నిర్మాణం(సీఆర్ఆర్) నిధులు 60 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, మహాత్మానగర్ ఉపాధి హామీ పథకం కింద 22లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం పనులతో అటు పల్లెలు అభివృద్ధి చెందడమే కాకుండా ఇటు వలసల నివారణను కూడా నిరోధించడం జరుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ చంద్రశేఖర్, డీఈఈ మంజులా భార్గవి, ఎంపిడివో విజయ్‌కుమార్, ఏఈ సురేందర్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

● **గన్నేరువరం :** గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు అయినపుడే గ్రామాల ప్రగతి పరుగులు పెడుతుందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లి, గుండ్లపల్లి స్టేజి గ్రామాల్లో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గుండ్లపల్లి గ్రామపంచాయతీ భవనానికి 30 లక్షలు విలువ చేసే రెండు గుంటల భూమిని గ్రామ అభివృద్ధి కోసం విరాళంగా అందజేసిన వంగల నర్సింహారెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. తహశీల్దారు ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి చిట్యాకరి అనంతరెడ్డి, ముస్కు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మరో పోరాటానికి సిద్ధం

చిగురుమామిడి,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు మరో పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వర్గీకరణ అయ్యేంతవరకు ఉద్యోగాల భర్తీ చేపట్టవద్దన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాథ మల్లయ్య, బోయిని సంపత్, రమేష్, నాంపల్లి, అదిమల్లయ్య, వేంకటేశం, చంద్రం, లతో పాటు అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా రామంచ గ్రామానికి చెందిన దొబ్బల బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా బోయిన శ్రీనివాస్, జిల్లెల సదయ్య, ప్రధాన కార్యదర్శి జిల్లె నాంపల్లి, కార్యదర్శి జేరిపోతుల వేంకటస్వామి, పందిపల్లి సురేష్, ప్రచార కార్యదర్శి దొబ్బల కిరణ్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

చొప్పదండిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) చొప్పదండి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం మండలంలోని చాకుంట గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుందని, ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజురైందని, త్వరలో ఏటిసీ మంజూరు కానుందని ఆయన తెలిపారు.గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తానని అయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, నాయకులు పాల్గొన్నారు

● **రామడుగు :** రాష్ట్రంలో అన్ని వర్గాలు మెచ్చేలా పదకొండు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగిందని, రానున్న రోజుల్లో ప్రజాపాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని వన్నారం గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో గ్రామపంచాయతీ భవనం, రూ. 40 లక్షలతో నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, పీఏసీఎస్ చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, మాజీ ఎంపీపీలు జవ్వాజి హరీష్, వీర్ల నర్సింగరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజని ప్రసాద్, కోల రమేష్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

● **గంగాధర :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండల కేంద్రంలో 10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మధురానగర్,పత్తికుంటపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చగా ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, నోట్‌బుక్స్‌ను ఎమ్మెల్యే సత్యం విద్యార్థులకు అందజేశారు. ఆయన వెంట సీడీపీవో కస్తూరి, మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ అనుపమ, కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు వెలిచాల తిరుమల్‌రావు, గంగాధర పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్,నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి) చొప్పదండి పోలీసులపై మానవ హక్కుల కమిషన్‌కు కల్లెపల్లి శారద అనే మహిళ ఫిర్యాదు చేశారు. తమ ఇంటి వద్ద ఇతర వ్యక్తి గోడ నిర్మాణం చేస్తున్న విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తన భర్త ఆత్మహత్యాయత్నం చేసినా స్పందన లేదని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు వినతి

రామడుగు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు.

● సంక్షిప్త సమాచారం..

●వీణవంక, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్ నాయకుడు కొమ్మడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు.

● హుజూరాబాద్ :పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ఓ ప్రైవేట్ పాఠశాల, పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ ఉన్నారు.

● చొప్పదండి: పట్టణంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద,దుర్గా మాత ఆలయం వద్ద బోరు, మోటార్‌ను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఆలయ నిర్వాహకుడు లచ్చయ్య ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వగా మంజూరు చేశారు.

● హుజూరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని పాటి మీద ఆంజనేయస్వామి సరస్వతి మాత సహిత ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఎస్సీఆర్ జగన్ రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టగా మంగళవారం రేకుల షెడ్డును మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక ప్రారంభించారు.

● గన్నేరువరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల కేంద్రంలో ఓ చిరు వ్యాపారి వద్ద మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గుప్ప రాజు తన స్నేహి తులతో కలిసి మంగళవారం కూల్‌డ్రింక్స్ కొనుగోలు చేశారు. బాటిల్ పైన గడువు ముగిసి ఉండడాన్ని గుర్తించారు. దుకాణాల లో అధికారులు తనిఖీలు నిర్వహించాలని వారు కోరారు.